




ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 227 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 2 ✦ https:www.prajarepublic.com ✦ వెల - 1/- | ఆదివారం 23 మార్చి 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

### వాణిజ్య ఒప్పందాలు ఓ వాస్తవం..
## భారత్ ప్రయోజనాలే ముందు: జైశంకర్

భారత్ మూడు కీలక వాణిజ్య ఒప్పందాలపై పనిచేస్తోందని.. మరోదానిలో చర్చలు మొదలు పెట్టిందని కేంద్ర మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు.

**(రిపబ్లిక్ న్యూస్), మార్చి 23:** వాణిజ్య ఒప్పందాలకు ప్రస్తుత కాలంలో అత్యంత ప్రాధాన్యం ఉందని విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. ఓ మీడియా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల్లో వాణిజ్య ఒప్పందాలు అత్యంత కీలకమైనవి. ప్రస్తుత కాలంలో వీటి ప్రాధాన్యం బాగా పెరిగిపోయింది. ఈ వాస్తవాన్ని భారత్ గుర్తించాలి. ప్రస్తుతం మనం మూడు అత్యంత కీలక వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతున్నాం. ఐరోపా సమాఖ్య, యూకేతో ఎన్టీఏ, అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందంపై చర్చలు జరుపుతున్నాం.



ఈ వారమే న్యూజిలాండ్లో కూడా వాణిజ్య ఒప్పందంపై చర్చలను ప్రారంభించాము. మరికొన్ని కూడా ప్రాసెస్లో ఉన్నాయి" అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అలాంటి ప్రయత్నాలను మనం అభినందించాలని జైశంకర్ పేర్కొన్నారు. ఈ క్రమంలో వాటి నుంచి వచ్చే లాభాలను జాగ్రత్తగా బేరీజు వేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. చర్యలు తీసుకోవడం.. తీసుకోకపోవడంలో ప్రయోజనాలను లెక్కలేసుకోవాలన్నారు. సున్నితమైన టెక్నాలజీ విషయంలో అటువంటి ఒప్పందాలతో ఇరు పక్షాలకు ప్రయోజనాలు లభించే అవకాశం ఉందని చెప్పారు. భారత్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం అనే విధానానికి ఇక నుంచి అనుసరిస్తామని జైశంకర్ వెల్లడించారు. గతంలో చాలా వరకు ఆసియాన్ దేశాలతోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకొన్నట్లు వెల్లడించారు. ఈ దేశాలతో వాణిజ్యం పోటాపోటీగా జరిగిందని.. కానీ, గల్ఫ్, పశ్చిమ దేశాలతో చేసుకొన్న ఒప్పందాల్లో మాత్రం మిగులు సాధించినట్లు వెల్లడించారు. ప్రతీకార సుంకాల అమలుకు డెడ్లైన్ దగ్గరపడేకొద్దీ భారత ప్రభుత్వం వాణిజ్య ఒప్పందంపై చర్చలను వేగవంతం చేస్తోంది.

# భారత అంతర్జాతీయ సరిహద్దులపై ఏఐ ఆధారిత రోబోల నిఘా..!

అంతర్జాతీయ సరిహద్దుల వద్ద భద్రత కోసం అస్సాంలోని గువాహటి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు అధునాతన ఏఐ ఆధారిత రోబోట్లను అభివృద్ధి చేశారు.

**దిల్లీ, మార్చి 23, (రిపబ్లిక్ న్యూస్):** అంతర్జాతీయ సరిహద్దుల వద్ద భద్రతను నిర్వహించడానికి అస్సాంలోని గువాహటి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు అధునాతన రోబోలను అభివృద్ధి చేశారని అధికారులు వెల్లడించారు. అత్యంత సవాళ్లతో కూడిన అంతర్జాతీయ సరిహద్దులను నిరంతరం పర్యవేక్షించడానికి ఈ ఏఐ ఆధారిత నిఘాతో ప్రయోజనం ఉంటుందని తెలిపారు. ఐఐటీ గువాహటిలోని డీప స్పాటియో రోబోటిక్ లాబొరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్టార్టప్ అభివృద్ధి చేసిన ఈ రోబోలు రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ నుంచి గుర్తింపు పొందినట్లు తెలుస్తోంది.



భారత సైన్యం ఇప్పటికే ఈ నిఘా వ్యవస్థ కోసం ఫీల్డ్ ట్రయల్స్ నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. డీఎస్ఆర్ఎల్ సీఈఓ అర్నబ్ కుమార్ బర్మాన్ మాట్లాడుతూ.. మనుషుల గస్తీపై ఆధారపడే సంప్రదాయ భద్రతా చర్యలకు భిన్నంగా ఈ రోబోలు స్వయంప్రతిపత్తి వ్యవస్థను కలిగి ఉంటాయన్నారు. ఇవి అన్ని వాతావరణ పరిస్థితుల్లో సమర్థవంతంగా పని చేస్తాయని తెలిపారు. "నావిగేషన్,-ఆధారిత నిఘాతో కూడిన ఈ వ్యవస్థ సరిహద్దు రక్షణ, కీలకమైన మౌలిక సదుపాయాల నిఘా, వ్యూహాత్మక రక్షణ విషయాల్లో ఓ విప్లవాత్మక మార్పుకానుంది. జాతీయ, అంతర్జాతీయ భద్రత విషయంలో ఎదురవుతున్న సవాళ్లను తట్టుకోవడానికి ఏఐ ఆధారిత అత్యాధునిక నిఘా పరికరాలను అభివృద్ధి చేయాలనేదే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. దుండగులు అంతర్జాతీయ సరిహద్దుల్లో డ్రోన్లను పంపడం, చొరబాట్లకు ప్రయత్నించడం వంటివి చేస్తే ఈ రోబోల సెన్సర్లు వెంటనే గుర్తించి అలర్ట్ చేస్తాయని అన్నారు. ఈ విధంగా రక్షణ జాతీయ భద్రతను బలోపేతం చేసే మరిన్ని ఆవిష్కరణలు చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు.

## శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో అంగరంగ వైభవంగా నిర్వహించే శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని సీఎం రేవంత్ రెడ్డిని మంత్రి కొండా సురేఖ, ఆలయ అర్చకులు ఆహ్వానించారు.

**హైదరాబాద్, మార్చి 23, (రిపబ్లిక్ న్యూస్):** శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డిని మంత్రి కొండా సురేఖ, దేవస్థానం అర్చకులు ఆహ్వానించారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును మంత్రి కొండా సురేఖ ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల వాల్పోస్టర్ను ఆవిష్కరించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన భూసేకరణ సహా ఇతర వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ, నిధులకు సంబంధించిన పూర్తి వివరాలు అందించాలని ఈ సందర్భంగా అధికారుల్ని ఆదేశించారు.



### మావోయిస్టుల ఏరివేత వేళ..
# పెరిగిన మందుపాతరల ముప్పు!

యాంటీ నక్సల్స్ ఆపరేషన్ల వేళ భద్రతాబలగాలకు మందుపాతర(ఐఈడీ)లు సవాల్గా మారుతున్నాయి.

మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతాబలగాలు దూకుడు ప్రదర్శిస్తున్నాయి. వచ్చే ఏడాది మార్చికల్లా నక్సల్స్ రహిత దేశంగా మార్చుతామన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో తమ ఆపరేషన్లను తీవ్రతరం చేశాయి. గత మూడు నెలల వ్యవధిలోనే దాదాపు 120 మంది మావోయిస్టులు మృతి చెందారు. అయితే, యాంటీ నక్సల్స్ ఆపరేషన్ల వేళ రక్షణ దళాలకు మందుపాతర (ఐఈడీ)లు సవాల్గా మారుతున్నాయి. ఇటీవల కాలంలో ఛత్తీస్గఢ్, ఝార్ఖండ్లలో ఐఈడీ పేలుళ్లు, స్వాధీనం ఘటనలు పెరిగాయి.



మరోవైపు సిగ్నల్స్ ద్వారా దూరం నుంచి పేల్చగల ఆర్సీఐఈడీ (రిమోట్ కంట్రోల్డ్ ఐఈడీ) లూ లభ్యమవుతుండటం కలవరం రేపుతోంది. అధికారిక గణాంకాల ప్రకారం గతేడాది ఛత్తీస్గఢ్ మందుపాతరలకు సంబంధించి 78 పేలుళ్లు, స్వాధీనం ఘటనలు నమోదయ్యాయి. ఈ ఏడాదిలో మార్చి మధ్య నాటికే ఈ సంఖ్య 100 దాటింది. 2020-22 లో సెక్యూరిటీ క్యాంపులకు 3-7 కిలోమీటర్ల పరిధిలో ఐఈడీలు లభ్యమయ్యేవని, 2023-24 మధ్యకాలంలో అవి మూడు కిలోమీటర్లలోపే వెలుగుచూస్తున్నట్లు ఓ నివేదికలో వెల్లడైంది. 2020-21తో పోలిస్తే 2022-24లో ఈ తరహా ఘటనలు 25 శాతం పెరిగాయని తేలింది. గత ఏడాది కాలంలో ఛత్తీస్గఢ్, ఝార్ఖండ్లలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో 70కుపైగా కొత్త ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్ (ఎఫ్ వోబీ)లు ఏర్పాటయ్యాయి. వీటి సంఖ్య పెరిగిన కొద్దీ ఐఈడీ ఘటనలూ పెరుగుతున్నట్లు ఓ అధికారి వెల్లడించారు.

**ఆర్సీఐఈడీల ముప్పు..!**

ఇటీవల కాలంలో 'ఆర్సీఐఈడీ'ల ముప్పు ఆందోళనకరంగా మారింది. గతవారం ఛత్తీస్గఢ్లోని బీజాపుర్ జిల్లాలో సీఆర్పీఎఫ్ క్యాంప్ సమీపంలో 5 కిలోల పేలుడు పదార్థం వెలుగుచూడటం కలకలం రేపింది. బాంబు వద్ద రెండు ఖాళీ గాజు సీసాలతోపాటు దూరం నుంచి పేల్చేందుకు వీలుగా సమీపంలోని ఓ చెట్టు కింద వైర్తో అనుసంధానమై ఉన్న చిన్న యాంటెన్నా కూడా లభ్యమైంది. ఈ ఏడాది జనవరిలో బీజాపుర్ జిల్లాలోనే ఓ వంతెన కింద తొలిసారి ఈ తరహా ఐఈడీని సీఆర్పీఎఫ్ స్వాధీనం చేసుకుంది. ఆర్సీఐఈడీల వాడకం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. సాధారణ మందుపాతరలతో పోలిస్తే.. దూరం నుంచి వీటిని పేల్చే వీలుండటంతో మరింత ప్రమాదకరమని హెచ్చరించారు.

**రక్షణ దళాలకు "హై అలర్ట్"**

మావోయిస్టుల టీసీవోసీ (టాక్టికల్ కౌంటర్ అఫెన్సివ్ క్యాంపెయిన్) సమీపిస్తున్న నేపథ్యంలో.. ఛత్తీస్గఢ్, ఝార్ఖండ్లలో ఐఈడీ దాడుల విషయంలో రక్షణ దళాలకు "హై అలర్ట్" జారీ చేసినట్లు ఓ అధికారి తెలిపారు. వేసవిలో అడవి పరిస్థితులను అనుకూలంగా మలచుకుని భద్రతాదళాలపై దాడులు చేసేందుకు మావోయిస్టులు టీసీవోసీ చేపడతారు. "మావోయిస్టులను నిర్మూలించాలన్న టార్గెట్కు అనుగుణంగా బలగాలు పనిచేస్తున్నాయి. ముఖ్యంగా బస్తర్లోని మారుమూల ప్రాంతాలకూ చొచ్చుకెళ్తున్నాయి. కొత్త క్యాంపులు ఏర్పాటు చేస్తున్నాయి. మరోవైపు.. ఆయుధాల కొరతతో మావోయిస్టులు ప్రత్యక్ష దాడులకు వెనుకంజ వేస్తున్నారు. బలగాలకు భారీ నష్టం చేకూర్చే లక్ష్యంతో మందుపాతరల మార్గాన్ని ఎంచుకుంటున్నారు" అని ఓ అధికారి తెలిపారు.

### తప్పు చేయకపోయినా..
## ఎన్నో కష్టాలు అనుభవించింది:రియా చక్రవర్తి లాయర్

బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్పుత్ మృతి కేసులో నటి రియా చక్రవర్తికి క్లీన్చిట్ ఇవ్వడంపై ఆమె లాయర్ స్పందించారు.

**(రిపబ్లిక్ న్యూస్), మార్చి 23:** బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్పుత్ మృతి కేసు మూసివేత నివేదికను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ముంబయి కోర్టులో దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై నటి రియా చక్రవర్తి లాయర్ సతీష్ మనేషిండే స్పందిస్తూ.. సీబీఐకి కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు ఈ కేసులోని ప్రతి అంశాన్ని అన్ని కోణాల నుంచి క్షుణ్ణంగా దర్యాప్తు చేసి.. ముగించారని చెప్పారు. ఏ ప్రమేయం లేకపోయినప్పటికీ సోషల్ మీడియాలో చేసిన తప్పుడు ప్రచారాల వల్ల రియా చక్రవర్తి ఎన్నో కష్టాలను అనుభవించారని ఆరోపించారు. చేయని తప్పుకు ఆమె 27 రోజులు జైలుశిక్ష అనుభవించారని గుర్తు చేసుకున్నారు.



ఎన్ని అవమానాలు ఎదురైనా రియా, ఆమె కుటుంబసభ్యులు మౌనంగా భరించి.. నిర్దోషులుగా బయటపడ్డారు. "సోషల్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ప్రముఖులపై చేస్తున్న నిరాధార ఆరోపణల వల్ల వారు ఎంతో కృంగి పోతున్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు దానికి అసలు కారణం తెలుసుకోకుండా సామాజిక మాధ్యమాల్లో అమాయకులపై తప్పుడు ప్రచారాలు చేస్తూ, నిర్దోషులనే దోషులుగా చిత్రీకరించి ప్రజల, అధికారుల ముందు నిలబెడుతున్నారు. ఇది ఏమాత్రం సరైన చర్య కాదు" అని ఆయన అన్నారు. ముంబయిలోని బాంద్రాలో 2020 జూన్ 14న సుశాంత్ సింగ్ తన ఫ్లాట్లో అనుమానాస్పద రీతిలో మరణించారు. సుశాంత్ ఆత్మహత్య చేసుకున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. అది ఆత్మహత్య కాదంటూ ఆయన కుటుంబసభ్యులు నటి రియా చక్రవర్తి, ఆమె ఫ్యామిలీపై కేసు పెట్టారు. వారు సుశాంత్ బ్యాంకు ఖాతా నుంచి రూ.15 కోట్లు బదిలీ చేసుకున్నారని అతడి తండ్రి కేకే సింగ్ ఆరోపించడంతో ఇందులో మనీలాండరింగ్ జరిగినట్లు భావించి ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రియాను ప్రశ్నించింది. నటుడి మృతి కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న రియా, ఆమె సోదరుడు షోవిక్ చక్రవర్తి జైలుకు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేసు బిహార్ పోలీసుల నుంచి 2020 ఆగస్టులో సీబీఐ చేతికి రాగా.. దాదాపు నాలుగేళ్లపాటు విచారణ కొనసాగింది. సుశాంత్ను ఆత్మహత్యకు ఎవరైనా ప్రేరేపించారనేందుకు ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని సమాచారం. రియా చక్రవర్తి, ఆమె కుటుంబానికి క్లీన్ చిట్ ఇచ్చినట్లు తెలిసింది.

### 'బ్లూఫ్లాగ్' పునరుద్ధరణ..
## ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం:మంత్రి దుర్గేష్

రుషికొండ బీచ్కు బ్లూఫ్లాగ్ గుర్తింపు పునరుద్ధరణపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు.



**అమరావతి, మార్చి 23, (రిపబ్లిక్ న్యూస్):** రుషికొండ బీచ్కు బ్లూఫ్లాగ్ గుర్తింపు పునరుద్ధరణపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. బ్లూఫ్లాగ్ పునరుద్ధరణపై గతంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. ఇందుకోసం కృషిచేసిన అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మరికొన్ని బీచ్లకు సైతం బ్లూఫ్లాగ్ గుర్తింపు కోసం ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి తెలిపారు.

## రాష్ట్రాలతో చర్చించాకే డీలిమిటేషన్ పై ముందుకెళ్లాలి: కేకే

అన్ని రాష్ట్రాలతో చర్చించాకే కేంద్రం డీలిమిటేషన్ పై ముందుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు అన్నారు.



**హైదరాబాద్, మార్చి 23, (రిపబ్లిక్ న్యూస్):** అన్ని రాష్ట్రాలతో చర్చించాకే కేంద్రం డీలిమిటేషన్పై ముందుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. డీలిమిటేషన్ అంశంపై చర్చలు జరుగుతున్నాయన్నారు. పార్లమెటులో చట్టం ఆమోదం పొందాకే కేంద్రం డీలిమిటేషన్ చేయాలన్నారు. పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం ఇంకా పెరగాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. కొన్ని రాష్ట్రాలు కేవలం సీట్లు గురించి మాత్రమే పోరాడటం లేదు.. పార్లమెంటులో తమ గళానికి ప్రాధాన్యత ఉండాలని అంటున్నాయని కేకే అన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# హైదరాబాద్‌కు డేవిడ్ వార్నర్

ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ హైదరాబాద్కు చేరుకున్నారు.




'రాబిన్‌హుడ్' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా నగరానికి విచ్చేసిన ఆయనకు చిత్రబృందం స్వాగతం పలికింది. ఎయిర్పోర్ట్‌లో ఆయన్ని చూసేందుకు, ఫొటోలు తీసుకునేందుకు అభిమానులు ఆసక్తి చూపించారు. సాయంత్రం జరగనున్న 'రాబిన్ హుడ్' ప్రీ రిలీజ్ ఈవెంట్లో వార్నర్ పాల్గొననున్నారు. చిత్రంలో యాక్ట్ చేయడంపై మాట్లాడనున్నారు. సినిమా విశేషాలను పంచుకోనున్నారు. మైదానంలోనే కాదు సోషల్మీడియాలోనూ డేవిడ్ వార్నర్కు విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న విషయం తెలిసిందే. తెలుగు సినిమా డైలాగ్స్, పాటలకు సరదా వీడియోలు చేసి నెట్టింట షేర్ చేస్తుంటారాయన. ఆ క్రేజ్ను దృష్టిలో ఉంచుకుని 'రాబిన్ హుడ్' టీమ్ తమ సినిమాలోకి తీసుకుంది. యాక్షన్ కామెడీ ఎంటర్టైనర్గా రూపొందుతోన్న ఈ సినిమాలో డేవిడ్ అనే పాత్రలో వార్నర్ కనిపించనున్నారు. తమ సినిమాలో ఆయన్ను భాగం చేయడం గురించి ఇటీవల హీరో నితిన్ మాట్లాడారు. "మా సినిమాలో డేవిడ్ పాత్ర ఎంతో ప్రత్యేకం. సినిమా ఆరంభం నుంచి ఆ పేరు వినిపిస్తూనే ఉంటుంది. ఆ రోల్ కోసం ఎవరిని ఎంచుకోవాలో ఆలోచించినప్పుడు.. మా దర్శకుడు వెంకీ కుడుములకు వార్నర్న తీసుకుంటే బాగుంటుందనిపించింది. వెంటనే ఆయన్ను సంప్రదించారు. రోల్ గురించి చెప్పిన వెంటనే సినిమాలో యాక్ట్ చేసేందుకు అంగీకరించారు. ప్రేక్షకులు తప్పకుండా ఎంజాయ్ చేస్తారు. సెకండాఫ్ లో ఆయన పాత్ర కనిపిస్తుంది" అని తెలిపారు. 'భీష్మ' తర్వాత వెంకీ కుడుముల, నితిన్ కాంబినేషన్లో వస్తోన్న చిత్రమిది. శ్రీలీల కథానాయిక. మార్చి 28న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## చరిత్రలో నేటి ప్రత్యేకత


- **1950:** ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం
- **1749:** ప్రముఖ ఫ్రెంచి గణిత శాస్త్రవేత్త, ఖగోళ శాస్త్రవేత్త పియరీ సైమన్ లాప్లాస్ జననం (మ.1827).
- **1893:** భారత దేశ ప్రముఖ ఆవిష్కర్త, ఇంజనీరు జి.డి.నాయుడు జననం (మరణం:1974).
- **1910:** ప్రముఖ సోషలిస్టు నాయకుడు, సిద్ధాంతకర్త రాంమనోహర్ లోహియా జన్మించాడు (మ.1967).
- **1931:** భారత స్వాతంత్ర్యోద్యమంలో కృషి చేసిన భగత్ సింగ్ (జ. 1907), రాజ్ గురు (జ. 1908), సుఖ్ దేవ్ (జ. 1907) లను ఉరి తీసారు.
- **1942:** రెండవ ప్రపంచ యుద్ధంలో అండమాన్ దీవులను జపనీయులు ఆక్రమించుకున్నారు.
- **1956:** ప్రపంచంలో మొదటి ఇస్లామిక్ రిపబ్లిక్ దేశంగా పాకిస్తాన్ అవతరించింది. (పాకిస్థాన్ గణతంత్ర దినోత్సవం)
- **1992:** ప్రముఖ ఆర్థికవేత్త, అర్థశాస్త్ర నోబెల్ బహుమతి గ్రహీత ఫ్రెడరిక్ హేయక్ మరణం (జ. 1899).
- **1994:** కపిల్ దేవ్ చివరి టెస్ట్ మ్యాచ్ ఆడిన రోజు.
- **1968:** తెలుగు సినీ నటుడు శ్రీకాంత్ జననం.


వాతావరణ శాస్త్ర దినోత్సవం


పియరీ సైమన్ లాప్లాస్


జి.డి.నాయుడు


రాంమనోహర్ లోహియా


భగత్ సింగ్


అండమాన్


పాకిస్తాన్


ఫ్రెడరిక్ హేయక్


కపిల్ దేవ్


శ్రీకాంత్

రిపబ్లిక్ సినిమా CINEMA

# ఆమెతో విడాకులు.. తీవ్ర కుంగుబాటుకు లోనయ్యా: ఆమిర్

బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ ఇటీవల వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న విషయం తెలిసిందే. తాజాగా ఆయన తన మాజీ భార్య రీనా దత్తా గురించి మాట్లాడారు.



బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ ఇటీవల వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న విషయం తెలిసిందే. తాజాగా ఆయన మాజీ భార్య రీనా దత్తా గురించి మాట్లాడారు. ఆమెను తాను ఎంతగానో ప్రేమించానని అన్నారు. తాము ఎంతో ఆనందంగా జీవితాన్ని ప్రారంభించినప్పటికీ అనుకోని విధంగా విడాకులు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఆ పరిణామాలను తాను ఏమాత్రం ఊహించలేదని అన్నారు. విడాకుల కారణంగా తాను మద్యానికి బానిసయ్యానని వెల్లడించారు. ఆ బాధ నుంచి బయటపడటానికి తనకు ఎంతో సమయం పట్టిందని వెల్లడించారు. "రీనాతో విడిపోయిన సమయంలో నేనెంతో బాధపడ్డా. సుమారు మూడేళ్లపాటు అలానే గడిపా. వర్క్పై దృష్టి పెట్టలేకపోయా. దాంతో షూటింగ్స్కు దూరంగా ఉన్నా. స్క్రిప్ట్ వినలేదు. ఇంట్లో ఒంటరిగా కూర్చొని బాధపడే వాడిని. నిద్ర పట్టేది కూడా కాదు. ఏం చేయాలో అర్థం కాలేదు. ప్రశాంతంగా నిద్రపోవడం కోసం మద్యం తాగడం అలవాటు చేసుకున్నా. అసలు ఆల్కహాల్ గురించి ఏమీ తెలియని నేను ఉన్నట్టుండి రోజుకో బాటిల్ తాగడానికి అలవాటు పడ్డా. ఒక విధంగా చెప్పాలంటే ఏడాదిన్నరపాటు దానికి బానిసయ్యా. దేవదాస్ అయ్యా. తీవ్ర మానసిక కుంగుబాటుకు గురయ్యా. ఆ పరిస్థితి నుంచి బయటపడటానికి ఎక్కువ సమయమే పట్టింది. పరిస్థితిని అర్థం చేసుకున్నా. ఇష్టపడిన వారు పక్కన లేకుండానే జీవితాన్ని కొనసాగించాలని తెలుసుకున్నా" అని ఆమిర్ ఖాన్ చెప్పారు. 1986లో ఆమిర్ ఖాన్ – రీనాదత్తా ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు కుమార్తె ఐరా, కుమారుడు జునైద్ ఉన్నారు. 2002లో ఈ జంట విడాకులు తీసుకుంది. అనంతరం ఆమిర్.. కిరణరావును వివాహం చేసుకున్నారు. 2021లో వీరిద్దరూ విడిపోయారు. ప్రస్తుతం ఆయన గౌరీ అనే స్నేహితురాలితో రిలేషన్లో ఉన్నారు. ఇదే విషయాన్ని ఇటీవల తన పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ప్రెస్మీట్లో వెల్లడించారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్

# సీఎస్కేకు ఆడుతూనే ఉంటా.. వీల్చైర్లో ఉన్నా లాక్కెళ్తారు: ధోనీ

చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో తన పరిస్థితి ఏమిటనే దానిపై భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకున్నాయి.



భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఐపీఎల్ నుంచి రిటైర్మెంట్ అవుతాడనే వార్తలు మళ్లీ మొదలయ్యాయి. గత సీజన్ లోనూ ఇదే తరహా మాటలు విని అలసిపోయిన అభిమానుల్లో జోష్ నింపుతూ ధోనీ ఇప్పుడు 18వ సీజనక్కూ సిద్ధమైపోయాడు. ఈ ఎడిషన్ ముగిసిన తర్వాత ఆటకు గుడ్బై చెబుతాడని మళ్లీ గుసగుసలు మొదలయ్యాయి. ఈ క్రమంలో సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ కూడా అలాంటిదేమీ ఉండదని వ్యాఖ్యానించాడు. తాజాగా ముంబయి ఇండియన్స్ మ్యాచ్ నేపథ్యంలో ధోనీనే స్వయంగా రిటైర్మెంట్పై వస్తున్న వార్తలను కొట్టిపడేశాడు. తాను వీల్చైర్లో ఉన్నా సరే ఫ్రాంచైజీ లాక్కెళ్లిపోతుందని.. ఎన్నాళ్లు ఆడాలనుకుంటే అంతకాలం ఆడతానని స్పష్టం చేశాడు. "చెన్నై సూపర్ కింగ్స్ ఇది నా ఫ్రాంచైజీ. సీఎస్కే తరఫున మరింతకాలం ఆడాలని అనుకుంటున్నా. ఒకవేళ నేను వీల్చైర్లో ఉన్నాసరే నన్ను లాక్కెళ్లిపోతారు" అని ధోనీ ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించాడు. 2023 ఐపీఎల్ సందర్భంగా మోకాలి గాయంతో అతడు బాధపడ్డాడు. ఆ సీజన్ ముగిశాక.. శస్త్రచికిత్స చేయించుకున్నాడు. గతేడాది ఇంపాక్ట్ ప్లేయర్గా బరిలోకి దిగి సిక్సర్లతో విజృంభించాడు. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. ఈసారి పూర్తి స్థాయి ఫిట్నెస్ సాధించినట్లే కనిపిస్తున్నాడు. మైదానంలో మ్యాచ్ మొత్తం ఉండే అవకాశం ఉందనేది క్రికెట్ విశ్లేషకుల అంచనా. బ్యాటింగ్ ఆర్డర్ లోనూ కాస్త ముందుకు వస్తాడని విశ్లేషించారు.

### ధోనీతో మాట్లాడటం చాలా సులువు: కరన్

ధోనీతో వ్యక్తిగతంగా చాటింగ్ చేయడంపై ఆల్రౌండర్ సామ్ కరన్ స్పందించాడు. "జట్టులో చాలా మంది లోకల్ ప్లేయర్లు ఉన్నారు. వారంతా ధోనీ చుట్టూ కుర్చొని ముచ్చటించడం భలేగా ఉంది. ఎవరైనా సరే అతడితో చాలా తేలిగ్గా మాట్లాడొచ్చు. అతడు ఎప్పుడూ కంగారు పడడు. నిశ్శబ్దంగా ఉంటూ భావోద్వేగాలను బయట పెట్టకుండా ముందుకు సాగిపోతాడు. ధోనీ, రవీంద్ర జడేజాతో కలిసి గత రాత్రి 11.30 గంటల వరకు ప్రాక్టీస్ చేశా. మనం ఏ ప్రపంచంలో ఉన్నామని అనుకున్నా. లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. బంతులను కొడుతూనే ఉండిపోయాం" అని కరన్ వెల్లడించాడు.

## అందం

# కొరియన్స్‌లా మెరవాలనుకుంటున్నారా, వారానికి రెండు సార్లు ఓ ప్యాక్ వేయండి, దీంతోపాటు ఏం చేయాలంటే

**కొరియన్స్ చూడ్డానికి చాలా అందంగా ఉంటారు. వాళ్ల స్కిన్ గ్లాసీ లుక్‌తో చక్కగా మెరుస్తుంటుంది. దీంతో వారి అలాంటి స్కిన్ కోసం చాలా మంది ట్రై చేస్తుంటారు. దానికోసం ఏం చేయాలో తెలుసుకోండి.**

మచ్చల్లేకుండా గ్లాసీ స్కిన్ కావాలని ప్రతి ఒక్కరికి ఉంటుంది. దీనికోసం ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తారు. కె డ్రామాస్ చూసే వారు అందులోని హీరోయిన్స్, వారి స్కిన్‌లానే మన స్కిన్‌కూడా ఉండాలని ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తారు. దీంతో వీరికోసమే మార్కెట్లోకి కొరియన్ గ్లాసీ లుక్ కోసమంటూ ఫేస్‌వాష్, క్రీమ్స్, రైస్ వాటర్ ఫేస్ వాష్ వంటివి వస్తున్నాయి. వీటి వల్ల స్కిన్ మెరుస్తుందని చెబుతుంటారు. అయితే, వీటి బదులు మనం రోజూ ఓ స్కిన్ కేర్ రొటీన్ ఫాలో అయితే స్కిన్ ఆటోమేటిగ్గా మెరుస్తుంది. ఆ రొటీన్ ఏంటో తెలుసుకోండి.



### స్టీమ్



కొరియన్ గ్లాస్ స్కిన్ కావాలంటే కచ్చితంగా స్కిన్‌కి ఆవిరిపట్టండి. రోజూ ఆవిరిపట్టడం లేదా స్టీమ్ షవర్స్ చేయడం వల్ల స్కిన్ చాలా బ్రైట్‌గా అవుతుంది. దీంతో స్కిన్ పోర్స్ ఓపెన్ అవుతాయి. అప్పటికప్పుడు చర్మంపై ఉన్న వ్యర్థాలు, దుమ్ము బయటికొస్తుంది. దీంతో మొటిమలు తగ్గుతాయి. మొటిమల మచ్చలు లేకుండా ఉంటాయి. ఆవిరి పట్టాక మన చేతి వేళ్లతో సర్క్యులర్ మోషన్‌లో మసాజ్ చేయాలి.

### డబుల్ క్లెన్స్




డబుల్ క్లెన్సింగ్ కూడా స్కిన్‌పై మ్యాజిక్ చేస్తుంది. మైల్డ్‌గా ఉండే క్లెన్సింగ్‌తో వాష్ చేస్తే స్కిన్ స్కిన్ పోర్స్ క్లీన్ అవుతాయి. దీని వల్ల రోజూ ఫాలో అయ్యే స్కిన్ కేర్‌ని ఫాలో అవ్వడానికి హెల్ప్ అవుతుంది. ముఖాన్ని క్లీన్ చేసిన తర్వాత ఎక్స్‌ఫోలియేషన్ చేయడం చాలా మంచిది. దీంతో బ్లాక్ అండ్ వైట్ హెడ్స్ దూరమవుతాయి.

### స్క్రబ్




కొరియన్ బ్యూటీస్ స్క్రబ్బింగ్ చేయడాన్ని ఇష్టపడతారు. దీనికోసం ఓ క్లాత్‌ని గోరువెచ్చని నీటిలో ముంచి మొత్తం స్క్వీజ్ చేయాలి. తర్వాత దీంతోముఖాన్ని అప్‌వార్డ్ డైరెక్షన్‌లో పైకి రుద్దాలి. దీంతో దుమ్ము, ధూళి మొత్తం బయటికి వస్తుంది. స్క్రబ్బర్ కాకుండా ఉతికిన క్లాత్ వాడడం వల్ల మంచి రిజల్ట్ ఉంటుంది.

### టోనింగ్, మాయిశ్చరైజింగ్



ఇప్పుడు మీ స్కిన్‌ని నేచురల్ వాటర్ రిచ్ ఇంగ్రేడియెంట్స్‌తో టోన్ చేయండి. దీని వల్ల స్కిన్ బ్రైట్‌గా మారుతుంది. కొరియన్స్ ఎక్కువగా ఫర్మెంటెడ్ రైస్ వాటర్ వాడతారు. దీని వల్ల స్కిన్ కొల్లాజెన్ పెరిగి రెడియెంట్‌గా స్కిన్ మెరుస్తుంది. ఇలా జరిగాక మంచి మాయిశ్చరైజర్ రాయండి. దీని వల్ల అందులోని విటమిన్స్, పదార్థాలు స్కిన్‌ని మాయిశ్చర్, హైడ్రేట్‌గా చేస్తాయి. స్కిన్ సెల్స్ కూడా బ్రైట్‌గా మారతాయి.

### ఫేస్‌మాస్క్



అదే విధంగా, స్కిన్‌కి హైడ్రేటింగ్ ఫేస్ మాస్క్ వాడడం మంచిది. వారానికి రెండు సార్లు వాడండి. దీని వల్ల స్కిన్ టాక్సిన్స్ దూరమై స్కిన్ ఫ్లాలెస్‌గా ఉంటుంది. అందంగా మెరుస్తుంది. ఇది పడుకునే ముందు చేయాలి. అదే విధంగా, ఓవర్‌నైట్ స్కిన్‌కేర్ మాస్క్ను కూడా వాడొచ్చు.

### హెర్బల్ టీ



అదే విధంగా, మంచి హెల్దీ టీ కూడా మీ స్కిన్ కేర్ రొటీన్‌లో యాడ్ చేసుకోండి. జిన్సెంగ్, రోస్టెడ్ బార్లీ, గ్రీన్ టీ వంటివి తీసుకోవాలి. దీని వల్ల రేడియెంట్ గ్లో మీ సొంతమవుతుంది. దీంతో స్కిన్ హెల్దీగా గ్లోగా మెరుస్తుంది. స్కిన్ టెక్చర్ కూడా పెరుగుతుంది.



**గమనిక:** నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.